సాక్షి అనకాపల్లి

గురువారం । 21 । సెప్టెంబర్ । 2023



రసవత్తరంగా రగ్బీ పోటీలు

విశాఖ ఉమ్మడి జిల్లా స్థాయి రగ్బీ ఎంపిక పోటీలు బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడి జెడ్పీ హైస్కూల్లో ఉత్సాహభరితంగా జరిగాయి. IIలో



జెడ్పీటీసీ నూకరాజుపై దాడి

కొయ్యూరు జెడ్పీటీసీపై రోలుగుంట మండలంలో దాడి జరిగింది. భూవివాదంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. IIలో



అమ్మవారి సన్నిధిలో..

విశాఖ: రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి. విజయబాబు దంపతులు బుధవారం సిరులతల్లి కనకమహాలక్ష్మిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

చందనం అలంకరణలో స్వయంభువుడు



చోడవరం: చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి బుధవారం చందనం అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచీ స్వామి వారిని దర్శించుకోవడానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పీఎస్‌పేటలోని శ్రీ లక్ష్మీగణపతి స్వామివారి ఆలయంలో భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పుట్రేవు శ్యామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు.

యూట్యూబ్ లైవ్ ద్వారా రైతులకు సూచనలు



కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు

రావికమతం: కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త ఎస్.రాజకుమార్, సస్యపోషణ విభాగం శాస్త్రవేత్త ఎ.సౌజన్య యూట్యూబ్ లైవ్ ప్రోగ్రాం ద్వారా రైతులకు వరిలో సస్య రక్షణ చర్యలను వివరించారు. రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రసారమైన ఈ కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా 300 మంది రైతులు వీక్షించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలలో పంటల పరిస్థితి, స్థితిగతులు, వర్షపాతం వివరించారు. వరిలో ఈ సీజన్‌లో ఆశించే తెగుళ్లు.. వాటి నివారణ చర్యలు, కలుపు నివారణ గురించి తెలియజేశారు.

గొలుగొండలో 'జగనన్నకు చెబుదాం' రేపు

గొలుగొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈ నెల 22న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఆనందరావు బుధవారం మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జాయింట్ కలెక్టర్ జాహ్నవితో పాటు ఉన్నతాధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజల సమస్యలను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

మరో పారిశ్రామిక వరం

- నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పరిశ్రమ
- రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం
- 2000 ఎకరాల భూమి కేటాయింపు
- ప్రత్యక్షంగా పరోక్షంగా 10 వేల మందికి ఉపాధి





పరిశ్రమల కోసం వేంపాడు సమీపంలో ఏపీఐఐసీ సేకరించిన భూమి

నక్కపల్లి: పారిశ్రామిక ఖిల్లాగా పేరొందిన అనకాపల్లి జిల్లాకు మరో పెద్ద పరిశ్రమ రానుంది. ఇప్పటికే ఇక్కడ ఎన్నో ఫార్మా కంపెనీలు ఉండగా.. వాటికి ముడి సరకును సరఫరా చేసే బల్క్ డ్రగ్ పార్క్‌ను కూడా నెలకొల్పేందుకు రాష్ట్ర మంత్రిమండలి బుధవారం ఆమోదం తెలపడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. దీనివల్ల ప్రత్యక్షంగా పరోక్షంగా 10 వేల మందికి ఉపాధి లభించనుంది. తొలుత ఈ పరిశ్రమను కాకినాడలో ఏర్పాటు చేయాలని తలపెట్టారు. రూ.2190 కోట్ల వ్యయంతో నెలకొల్పే ఈ పరిశ్రమకు సుమారు 2000 ఎకరాల భూమి అవసరం కానుంది. రైతుల నుంచి భూములు సేకరించి ఈ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన వెళ్లింది. ఈ పరిశ్రమను ప్రభుత్వ భూములున్న చోట మాత్రమే ఏర్పాటు చేయాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేయడంతో ఆలోచన మారింది. ప్రభుత్వ భూములు పుష్కలంగా ఉన్న నక్కపల్లి మండలాన్ని కొత్తగా ఎంపిక చేశారు.

సిద్ధంగా ఉన్న భూములు

విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణంలో భాగంగా నక్కపల్లి క్లస్టర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటు కోసం ఏపీఐఐసీ 4,500 ఎకరాలను సేకరించింది. భూసేకరణ ప్రక్రియ, నష్టపరిహారం, ప్యాకేజీల చెల్లింపు ప్రక్రియ పూర్తి చేసింది. మండలంలో రాజయ్యపేట, వేంపాడు, చందనాడ, డీఎల్‌పురం, బుచ్చిరాజుపేట గ్రామాల్లో సేకరించిన భూములు ప్రస్తుతం ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. ఈఎస్ఈజడ్‌లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం స్టార్టప్ ఏరియా కింద 1100 ఎకరాలు సిద్ధం చేసింది. ఈ ఎస్ఈజడ్ కోసం జాతీయ రహదారి నుంచి 80 అడుగుల రోడ్డు నిర్మాణానికి కూడా ఏపీఐఐసీ వారు కసరత్తు చేస్తున్నారు. ఇక్కడ మౌలిక సదుపాయాల అభివృద్ధి, పరిశ్రమల స్థాపన కోసం అవసరమైన రుణసాయం కోసం ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు అధికారుల బృందం కూడా ఇటీవల ఈ ప్రాంతాల్లో పర్యటించింది. బుధవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో కాకినాడలో ఏర్పాటు చేయబోయే బల్క్ డ్రగ్ పరిశ్రమను నక్కపల్లి తరలించేందుకు, అక్కడ ఈ పరిశ్రమ కోసం ఏపీఐఐసీ వారు సేకరించిన భూముల్లో సుమారు 2000 ఎకరాలు కేటాయించేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఇప్పటికే నక్కపల్లి మండలం రాజయ్యపేట సమీపంలో దివంగత సీఎం వైఎస్సార్ కృషి వల్ల హెటిరో రసాయన పరిశ్రమ ఏర్పాటయింది. ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 10 వేల మంది ఉపాధి పొందుతున్నారు. అలాగే పాయకరావుపేట మండలం కేశవరం సమీపంలో ఏర్పాటు చేసిన డక్కన్ ఫైన్ కెమికల్స్ పరిశ్రమ వల్ల మరో 5 వేలమంది ఉపాధి పొందుతున్నారు. తాజాగా నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పరిశ్రమ ఏర్పాటుకు భూములు కేటాయిస్తూ మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

బల్క్ డ్రగ్ పార్క్ అంటే..

మందులు తయారు చేసే ఫార్మా కంపెనీలకు ముడి సరకు అవసరం. ఈ ముడి సరకును తయారు చేసేదే బల్క్ డ్రగ్ యూనిట్. కాకినాడ సెజ్‌లో అరబిందో, లారస్, దివిస్ వంటి ఫార్మా కంపెనీల మందుల తయారీ యూనిట్లు నెలకొల్పాయి. అలాగే నక్కపల్లిలో హెటిరో, పాయకరావుపేటలో దక్కన్ కంపెనీలతోపాటు అచ్యుతాపురంలో పలు మందుల కంపెనీలకు రా మెటీరియల్ కావాలి. అందు కోసం బల్క్‌డ్రగ్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టింది. ఈ పరిశ్రమ ఏర్పాటయితే దాదాపు 10 వేలమంది స్కిల్డ్, అన్‌స్కిల్డ్ లేబర్‌కి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయి. కెమికల్ ఇంజినీరింగ్, బీఎస్సీ, ఫార్మసీ చదివిన వారికి ఉద్యోగాలు లభిస్తాయి.

అక్టోబర్ 17 నాటికి ఓటర్ల ముసాయిదా జాబితా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: ఓటరు జాబితా పూర్తిచేసి ముసాయిదాను ప్రచురిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చెప్పారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన పలు రాజకీయపార్టీల నేతలతో సమావేశమయ్యారు. అక్టోబర్ 17న ఓటర్ల జాబితా ముసాయిదా ప్రచురిస్తామన్నారు. దీనిపై అభ్యంతరాలు ఆరోజు నుంచి నవంబర్ నెలాఖరు వరకు స్వీకరిస్తామన్నారు. శని, ఆదివారాలైన అక్టోబర్ 28, 29, నవంబర్ 18, 19 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తామన్నారు. బూత్ స్థాయి ఏజెంట్లను నియమించని పోలింగ్‌స్టేషన్లకు రాజకీయ పార్టీలు వెంటనే బీఎల్ఏలను నియమించాలన్నారు. శనివారం ఈవీఎం, ఇతర సంబంధిత సామగ్రి భద్రపరిచే గోదామును ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.శ్రీనివాసరావు(టీడీపీ), ఎం.హరినాథబాబు (ఆమ్‌ఆద్మీ), జి.శ్రీరాం (సీపీఎం), ఎల్‌వీవీ రామచంద్రరావు (బీఎస్పీ), ఎన్నికల సూపరింటెండెంట్ లక్ష్మీదేవి, డీటీ రవికుమార్ పాల్గొన్నారు.

రూ.12.50 కోట్లతో 125 ఆలయాల నిర్మాణం

- దేవదాయ ధర్మాదాయ శాఖ డీఈ దూదేకుల సైదా

నాతవరం: ఉమ్మడి జిల్లాలో టీటీడీ శ్రీవాణి ట్రస్టు నిధులు రూ.12.50 కోట్లతో 125 దేవాలయాల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయని దేవదాయ, ధర్మాదాయ శాఖ డీఈ దూదేకుల సైదా తెలిపారు. బుధవారం ఆయన నాతవరం, గన్నవరం, మర్రిపాలెం గ్రామాల్లో నిర్మిస్తున్న ఆలయాల పనులను పరిశీలించి, పలు సూచనలిచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి గ్రామంలో హిందూ ఆలయం ఏర్పాటు చేయాలనే సంకల్పంతో టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఒక్కో ఆలయానికి విగ్రహంతో కలిపి రూ.10 లక్షలు చెల్లిస్తున్నామన్నారు.



నాతవరంలో శ్రీనల్లకొండమ్మ తల్లి వద్ద డీఈ సైదా, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇప్పటి వరకు 15కు పైగా ఆలయాల నిర్మాణాలు పూర్తి చేసి, స్థానిక ఎమ్మెల్యేలచే ప్రారంభోత్సవాలు చేయించినట్లు తెలిపారు. మరో 80కి పైగా ఆలయాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నట్లు పేర్కొన్నారు.వైస్ ఎంపీపీ పైల సునీల్, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, స్థానిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు సక్రమమే!



చర్చా వేదికలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ చలం

- చట్ట ప్రకారమే సీఐడీ నడుచుకుంది
- అవినీతికి పాల్పడిన మాజీ సీఎంలు గతంలో అరెస్టయ్యారు
- చట్టం ఎవరికీ చుట్టం కాదు..
- రూల్ ఆఫ్ లా అండ్ పబ్లిక్ సర్వీస్ లైఫ్ చర్చావేదికలో వక్తలు

సాక్షి, విశాఖపట్నం: 'చట్టం ఎవరికీ చుట్టం కాదు.. అవినీతికి పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్ట ప్రకారం శిక్షకు అర్హులే. గతంలో అవినీతి ఆరోపణలతో కేసులు నమోదైన పలువురు మాజీ ముఖ్యమంత్రులు అరెస్టై జైలు కెళ్లారు. ఇప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి అరెస్టు కూడా సక్రమమే. చట్ట ప్రకారమే సీఐడీ నడుచుకుంది' అంటూ పలువురు న్యాయ నిపుణులు పేర్కొన్నారు. వైజాగ్ ఇంటలెక్చువల్ ఫోరం ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె.ఎస్. చలం ఆధ్వర్యంలో రూల్ ఆఫ్ లా అండ్ పబ్లిక్ సర్వీస్ లైఫ్ పేరిట బుధవారం నగరంలోని పౌర గ్రంథాలయంలో చర్చా వేదిక జరిగింది. దీనికి పలువురు న్యాయ నిపుణులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ చర్చా వేదికలో ఎవరేమన్నారంటే..


వైఎస్సార్‌కు రాష్ట్రం రుణపడి ఉండాలి..



రాష్ట్రానికి లా యూనివర్సిటీ ఆవశ్యకతను గుర్తించి సబ్బవరంలో నల్సార్‌కు దీటైన దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయాన్ని (డీఎస్ఎన్ఎల్‌యూ) దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కృషి, పట్టుదలతో ఏర్పాటు చేశారు. అందుకే ఆయన చరిత్రలో నిలిచిపోయారు. రాష్ట్రంలో అత్యున్నత విద్యా ప్రమాణాలున్న ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటు రాష్ట్రానికే గర్వకారణం. వైఎస్సార్‌కు ఆంధ్ర రాష్ట్రం రుణపడి ఉండాలి. భారత్‌లో రూల్ ఆఫ్ లా ఎంతో పటిష్టంగాను, ఇతర దేశాలకు ఆదర్శంగానూ ఉంది. స్కాండినేవియాకు ప్రపంచంలోనే అత్యంత సంతోష దేశంగా పేరు. మా ప్రజలు అవసరానికి మించి ఏమీ ఆశించరు.. అందుకే మేం అభివృద్ధి కంటే సంతోషానికే ప్రాధాన్యమిస్తామని చెప్పే ఆ దేశ పాలకుల మాటలు గమనంలోకి తీసుకోవాలి.

– వై.సత్యనారాయణ, ప్రథమ వైస్ ఛాన్సలర్, డీఎస్ఎల్‌యూ

పక్కా ఆధారాలతోనే..



ప్రజా ప్రతినిధులు చేసే అవినీతిని నిరూపించడం చాలా కష్టం. ఎందుకంటే కొంతమంది తమ సహాయకుల ద్వారా అక్రమార్జనకు పాల్పడతారు. వారికి మౌఖిక ఆదేశాలివ్వడం ద్వారా దర్యాప్తు సంస్థలకు దొరక్కుండా తప్పించుకుంటారు. అందుకే ప్రధాని స్థాయి నుంచి సామాన్యుడి వరకు ఒకే రూల్ ఆఫ్ లా అమలు కావాలి. మాజీ సీఎం చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో సమగ్ర దర్యాప్తు అనంతరం పక్కా ఆధారాలతోనే సీఐడీ అరెస్టు చేసింది.

–ఎ.సుబ్రహ్మణ్యం, పూర్వ రిజిస్ట్రార్, డీఎస్ఎల్‌యూ


స్కిల్ స్కీం.. స్కాం అయింది..



చంద్రబాబు హయాంలో స్కిల్ డెవలప్‌మెంట్ స్కీం కాస్తా స్కాంగా మారింది. ఆయనపై సీఐడీ నమోదు చేసిన సెక్షన్లతో పదేళ్లకు పైగా జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఆధారాల్లేకుండా చంద్రబాబును అరెస్టు చేశారంటూ ఆయన కోడలు బ్రాహ్మణి ఆరోపణలు చేస్తున్నారు. అభియోగాలున్న వ్యక్తిని అరెస్టు చేయవచ్చన్న విషయం తెలుసుకోవాలి. ఇప్పటికే ఈ స్కాంలో బాధ్యులైన చంద్రబాబు పీఏ శ్రీనివాస్, మరో వ్యక్తి విదేశాలకు పారిపోయారు.

– బంగారి, అధ్యక్షుడు, జై ఉత్తరాంధ్ర ఫోరం


దొరికితేనే దొంగ..



చంద్రబాబు ఇన్నాళ్లూ తాను నిప్పు అని చెప్పుకున్నారు. తననెవరూ ఏమీ చేయలేరని బీరాలు పలికారు. స్కిల్ స్కాంలో అడ్డంగా దొరికిపోయారు. దీంతో దొరికితేనే దొంగ అన్న చందంగా మారింది ఆయన తీరు. రూల్ ఆఫ్ లా పనిచేస్తే కక్ష సాధింపు అంటున్నారు. ప్రభుత్వ సొమ్ము దోపిడీ చేసిన వారిని శిక్షించకూడదా?

– పొకా సత్యనారాయణ, సీనియర్ న్యాయవాది

బాబులాగే ఎందరో..



అవినీతి ఆరోపణలతో అరెస్టయిన వారిలో బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, హర్యానా రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రులు లాలూ ప్రసాద్ యాదవ్, మధుకోడా, మాయావతి, కరుణానిధి, యడ్యూరప్ప, ఓంప్రకాష్ చౌతాలా వంటి వారున్నారు. ఇదేమీ కొత్త కాదు.

– సుబ్బారావు, లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్

జగనన్నకు చెబుదాం..

మీ వద్దకే వచ్చి వింటాం

- సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా నిర్వహణ
- రావికమతంలో అర్జీదారులతో కిక్కిరిసిన జగనన్నకు చెబుదాం
- మొత్తం అర్జీలు 346.. వాటిలో రెవెన్యూ సమస్యలే ఎక్కువ



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా, మండల స్థాయి అధికారులు



కలెక్టర్, ఇతర జిల్లా అధికారులకు వినతులు అందిస్తున్న అర్జీదారులు

రావికమతం: గ్రామస్థాయి సమస్యల్ని విన్నవించుకునేందుకు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లాలంటే రైతులకు కాస్త బెరుకు. పైపెచ్చు ప్రతి చిన్న సమస్యకు పరుగులు తీస్తే ఏమనుకుంటారోనన్న మొహమాటం రైతులది. దీంతో చిన్న చిన్న సమస్యలే కాక కొన్ని ప్రధాన సమస్యలున్నా కలెక్టర్ కార్యాలయానికి చాలా మంది అర్జీదారులు వెళ్లలేకపోతున్నారు. ఇలాంటి వారి కోసమే మండల స్థాయిలో జగనన్నకి చెబుదాం (స్పందన) కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రావికమతం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్నకి చెబుదాం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఉదయం 10 గంటల ప్రాంతంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల వరకూ ఉన్నారు. భారీగా అర్జీదారులు రావడంతో వారికి అసౌకర్యం లేకుండా 8 కౌంటర్లను ఏర్పాటు చేశారు. సాధ్యమైనంత మేరకు అందరితోనూ విడివిడిగా మాట్లాడారు. మొత్తం 346 అర్జీలు స్వీకరించారు. సమస్యలు తెలుసుకుని తప్పక పరిష్కారం చూపుతామని భరోసానిచ్చారు. వచ్చిన అర్జీల్లో రెవెన్యూ సమస్యలే ఎక్కువగా ఉండటంతో మండల, గ్రామ రెవెన్యూ అధికార్ల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మండల స్థాయిలో అధికార్లు పదే పదే చెప్పినా పనులు చేయకుంటే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికార్లను ఆదేశించారు.

ప్రధానమైన అర్జీల్లో కొన్ని..

- కవగుంట రెవెన్యూలో గతంలో భూస్వాములకు ఇచ్చిన పట్టాలు రద్దు చేసి, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అయితే పాతవారిలో కొంత మందికి రెవెన్యూ అధికారులు అక్కడే మళ్లీ పట్టాలివ్వడంపై రైతులు అర్జీలు దాఖలు చేశారు.
- రావికమతం–తోటకూరపాలెం, నర్సీపట్నం–భీమునిపట్నం రహదార్లు బాగుచేయాలని ఆయా గ్రామాల ప్రజలు మొరపెట్టుకున్నారు.
- కొత్తకోటలో రహదారి విస్తరణ చేయాలని, ఆ గ్రామంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని పలువురు అర్జీలు అందించారు. కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ ఆధ్వర్యంలో రావికమతం, కొత్తకోట పోలీసులు, సిబ్బంది ప్రత్యేక బందోబస్తు సేవలు అందించారు.

గ్రామ స్థాయిలో కొత్త కొత్త అర్జీలు

గ్రామ స్థాయిలో జగనన్నకు చెబుదాం(స్పందన) నిర్వహించడంతో గ్రామాల్లోని రైతులు నుంచి కొత్తకొత్త అంశాలపై అర్జీలు వస్తున్నాయి. గతంలో వీరెవరూ జిల్లా కేంద్రాలకు ఈ అర్జీలపై రాలేదు. ఇలాంటి వారి సమస్యలు పరిష్కరించేందుకే గ్రామస్థాయి స్పందన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. స్పందన కార్యక్రమం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండల కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంతో దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. నాతవరం మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో వచ్చిన సమస్యల్లో 60 శాతం వరకూ ఇప్పటికే పరిష్కరించామన్నారు. సాగులో ఉన్న రైతులకు పట్టాలివ్వాలని అధికంగా అర్జీలు వస్తున్న దృష్ట్యా వాటిపై దృష్టి సారిస్తున్నామన్నారు.

వెబ్‌ల్యాండ్‌లో సాగు నమోదుకు అర్జీ



కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న గిరిజన రైతులు

ఉరలోవ కొండను ఆనుకుని ఉన్న రెవెన్యూ వెబ్ ల్యాండ్ రికార్డుల్లో సాగుదారుల వివరాలను నమోదు చేయాలని కోరుతూ కొమిర, కవగుంట, బుడ్డబంద గ్రామాలకు చెందిన పలువురు గిరిజన రైతులు కలెక్టర్‌కు నివేదించారు. ఉరలోవ కొండ రెవెన్యూలో సాగులో ఉన్న 370 ఎకరాలకు 412 మందికి 2013లో పట్టాలిచ్చారని, అయితే ఆ వివరాలు వెబ్‌ల్యాండ్‌లో అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ రాయితీలేవీ అందట్లేదని వాపోయారు. ప్రభుత్వం చేస్తున్న రీ సర్వేలోనైనా తమ సమస్యను పరిష్కరించాలని రైతులు అర్జీ పెట్టుకున్నారు.

రైతుల సమస్య విన్నవించాం

రెవెన్యూ పరిధి సర్వే నెం.104లో 37.64 ఎకరాల భూమి గతంలో జిరాయితీగా ఉండేది. ప్రస్తుతం రెవెన్యూ రికార్డుల్లో అతుకుబడి భూమిగా నమోదయింది. దీంతో రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. దాన్ని తొలగించాలని మా రైతులతో వచ్చి అర్జీ పెట్టాం. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. మా ఊరికి దగ్గర్లో ఉన్నతాధికారులు వచ్చి, మా సమస్యల్ని తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తుండటం చాలా ఆనందాన్నిస్తుంది. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇలా చూడలేదు.

–విరోధి రాజారావు, పి.పొన్నవోలు సర్పంచ్

క్లుప్తంగా

23న జిల్లా స్థాయి ఖో-ఖో క్రీడాకారుల ఎంపిక


అనకాపల్లిటౌన్ : రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల 42వ జూనియర్ ఖో-ఖో పోటీలు చిత్తూరు జిల్లాలో అక్టోబర్ 19, 20, 21వ తేదీల్లో జరుగుతాయని జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్షుడు దాడి జయవీర్ బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్ర పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపిక కార్యక్రమం ఈనెల 23వ తేదీన అనకాపల్లి మండలంలో తుమ్మపాల ఖో-ఖో క్రీడామైదానంలో మధ్యాహ్నం 3గంటలకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. క్రీడాపోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2006 జనవరి 1వ తేదీ తరువాత జన్మించి ఉండాలని, వివరాలకు 8309960421 నంబరును సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక


హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన శ్రీప్రకాష్ విద్యార్థులు

పాయకరావుపేట : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఎంజెపిబిసిడబ్ల్యుఆర్ స్కూల్, సింహాచలంలో జరిగిన అండర్-14, అండర్ 17 బాలుర, బాలికల హ్యాండ్ బాల్ జిల్లా స్థాయి పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 14 బాలికల విభాగంలో ముగ్గురు, బాలుర విభాగంలో ఒకరు, అండర్ 17 బాలుర విభాగంలో ముగ్గురు, బాలికల విభాగంలో నలుగురు ఎంపికయ్యారని, వీరు ఈ నెల 29 వ తేదీ నుంచి గుంటూరు జిల్లా తెనాలిలో ఎ.ఎస్.ఎన్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనున్నారని ప్రధానోపాధ్యాయుడు డి.వి. శ్రీనివాస్ తెలిపారు.

109.60 మీటర్లకు చేరుకున్న రైవాడ నీటిమట్టం


రైవాడ రిజర్వాయర్‌లో జల కళ

దేవరాపల్లి: అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైవాడ జలాశయం నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 109.60 మీటర్లకు చేరుకుంది. జలాశయంలోకి 450 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో కనుచూపు మేర నిండుకుండలా దర్శనమిస్తోంది. రిజర్వాయర్లో పుష్కలంగా నీరు ఉండటంతో ఖరీఫ్ పంటల సాగునీటికి ఢోకా ఉండదని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైవాడ నుంచి జీవీఎంసీకి 50 క్యూసెక్కుల నీటి సరఫరా యథావిధిగా కొనసాగుతోంది.

రసవత్తరంగా ఉమ్మడి జిల్లా స్థాయి రగ్బీ ఎంపిక పోటీలు

- ప్రారంభించిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- మూడు జిల్లాల నుంచి 280 మంది విద్యార్థులు హాజరు
- రాష్ట్ర జట్టుకు 48 మంది విద్యార్థులు ఎంపిక


రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైన విద్యార్థులు


సెలక్షన్ పోటీల్లో రసవత్తరంగా ఆడుతున్న విద్యార్థులు

బుచ్చెయ్యపేట : విద్యార్థులు చదువుతో పాటు ఆటల పోటీల్లో రాణించాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆకాంక్షించారు. బుధవారం విశాఖ ఉమ్మడి జిల్లా స్థాయి రగ్బీ సెలక్షన్ ఆటల పోటీలు బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడి జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగాయి. అనకాపల్లి, విశాఖ, అల్లూరి సీతారామరాజు మూడు జిల్లాలకు చెందిన 40 పాఠశాలల నుంచి 280 మంది విద్యార్థినీవిద్యార్థులు ఆటల పోటీలకు హాజరయ్యారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా సెలక్షన్ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల మధ్య రసవత్తరంగా రగ్బీ ఆటల పోటీలు జరిగాయి. ఈ ఆటల పోటీల్లో క్రీడా నైపుణ్యం చూపిన అండర్ 14 జట్టుకి బాలికలు 12 మందిని, బాలురు 12 మందిని ఎంపిక చేశారు. అండర్ -17 జట్టుకి బాలికలు 12 మందిని, బాలురు 12 మందిని రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక చేశారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే రగ్బీ ఆటల పోటీల్లో 48 మంది విద్యార్థులు పాల్గొంటారని పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ, పీఈటీ బి.కిరణ్‌కుమార్ తెలిపారు. ఆటల పోటీల్లో అత్యధిక ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విప్ ధర్మశ్రీ అభినందించారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, మాజీ సర్పంచ్ గొంపా అప్పారావు, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మెన్ పాతాళ సత్తిబాబు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

- రామన్నపాలెం సమీపంలో ఘటన
- సంఘటన ప్రాంతాన్ని పరిశీలించిన ఏఎస్పీ
- నిందితుల కోసం గాలింపు


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ, ఇతర పోలీసులు


హత్యకు గురైన రవి , రవి (ఫైల్)

మాకవరపాలెం: యువకుడి దారుణ హత్య మండలంలో కలకలం రేపింది. రామన్నపాలెం గ్రామ సమీపంలో ఈ హత్య జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలాఉన్నాయి. మండలంలోని దుంగలవానిపాలెం గ్రామానికి చెందిన ధనిమిరెడ్డి రవి(35) ఒరిస్సా ప్రాంతంలో పొక్లెయిన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మూడు నెలల క్రితం ఇంటి నుంచి పనికి వెళ్లాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం సుభద్రయ్యపాలెం వెళ్లే రోడ్డులో రామన్నపాలెం సమీపంలో హత్యకు గురై విగతజీవిగా ప్రత్యక్షమయ్యాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ రామకృష్ణారావు, రూరల్ సీఐ రమణమ్మ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. తొలుత గుర్తు తెలియని వ్యక్తిగా భావించిన పోలీసుల దర్యాప్తులో రవిగా నిర్ధారించారు. వర్షం కురుస్తున్నప్పటికీ పోలీసులు సంఘటన ప్రాంతంలో ఉన్న అన్ని ఆధారాలను సేకరించారు. క్లూస్ టీంతోపాటు డాగ్ స్క్వాడ్‌తో సహా దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని, సంఘటన జరిగిన ప్రాంతాన్ని నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్ సింగ్‌రాణా సందర్శించి వివరాలు సేకరించారు. అక్కడే ఉన్న బండరాయితో తల, ముఖంపై కొట్టి హత్య చేసినట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ఈ హత్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. హత్యకు అక్రమ సంబంధమా ? లేక ఇతర ఏదైనా కారణం ఉందా ? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ రమణయ్య మాట్లాడుతూ హత్య చేసిన వ్యక్తులను గుర్తించేందుకు దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. మృతుడికి రెండేళ్ల క్రితం కాకినాడకు చెందిన యువతితో వివాహం జరగ్గా, 8 నెలల పాప ఉంది. విషయం తెలుసుకున్న రవి కుటుంబ సభ్యులు మృతదేహం వద్దకు చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేటకు చెందిన యువతి కనిపించడం లేదని ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మహమ్మద్ అలీ షరీఫ్ తెలిపారు. తిమ్మరాజుపేటకు చెందిన రావాడ సీతారామ్‌కు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె స్వాతి ఇంటర్ ప్రథమ సంవత్సరం పూర్తి చేసింది. కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేందుకు అనకాపల్లిలో ప్రయివేటు షాపులో పనిచేసి కొంతకాలం క్రితం మానివేసింది. ఇదిలా ఉండగా బుధవారం ఉదయం తాను అనకాపల్లి వందపడకల ఆసుపత్రికి వెళ్లి మాత్రలు తీసుకుంటానని చెప్పి స్వాతి ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రం అవుతున్నా ఆమె ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆమె కోసం ఆరా తీసినా ఆచూకీ లేకపోవడంతో తండ్రి సీతారామ్ మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ అలీ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇరువురికి గాయాలు


ఘటనా స్థలంలో ఛిద్రమైన బైకులు

రావికమతం: చీమలపాడు గ్రామం వద్ద బుధవారం రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఇరువురు గిరిజనులకు తీవ్ర గాయాలైనట్లు కొత్తకోట ఎస్ఐ విభీషణరావు బుధవారం తెలిపారు. కొత్తకోట నుంచి పెదెంపాలెం వెళ్తున్న సెగ్గే కృష్ణ, సన్నిబాబు బైక్‌ను ఎదురుగా పల్సర్ బైక్‌పై వస్తున్న గుర్తు తెలియని వ్యక్తి బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కృష్ణ, సన్నిబాబులకు తీవ్రగాయాలయ్యాయి. కృష్ణ భార్య తలుపులమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పరారైన పల్సర్ బైకిస్టు ఆచూకీ కోసం వెతుకుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఈ-పంట నమోదుపై అవగాహన తప్పనిసరి


సిబ్బందికి సూచనలిస్తున్న జెసి జాహ్నవి

రావికమతం: ఈ-పంట నమోదు ఆవశ్యకతను రైతులకు పదేపదే తెలియజేయాలని వ్యవసాయ సిబ్బందికి జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి, జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు సూచించారు. రావికమతం ఆర్బీకే పరిధిలో ఈ-క్రాప్ నమోదు తీరును క్షేత్ర స్థాయిలో బుధవారం పరిశీలించారు. ప్రతి రైతుకు ఖరీఫ్ ఈ-పంట నమోదు ప్రాధాన్యతను తెలపాలన్నారు. ఈ-పంటకు సంబంధించి ఈకేవైసీ ఈ నెల 30 నాటికి పూర్తి చేయించాలని ఆదేశించారు. ఈ-పంట నమోదు కాకపోతే రైతులు కోల్పోయే ప్రయోజనాలను వివరించి, వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు.

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన కేంద్ర వైద్యబృందం


కేంద్ర వైద్య బృందం ప్రతినిధులతో ఏరియా ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది

నర్సీపట్నం : జాతీయ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఢిల్లీ నుంచి ఇద్దరు వైద్య బృందం సభ్యులు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిని బుధవారం సందర్శించారు. కేంద్ర ప్రభుత్వం తరపున డా.వై.రమణ, డా.శ్రీనివాస్ జాతీయ ఆరోగ్య పథకం ద్వారా ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. బృందం ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించి రోగులతో మాట్లాడారు. ఆయా విభాగాల ద్వారా అందిస్తున్న సేవలు గురించి ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలవేణిదేవి బృంద సభ్యులకు వివరించారు. రికార్డులను తనిఖీ చేసి వైద్యులు, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏరియా ఆసుపత్రిలో పాటు తాళ్లపాలెం, మాకవరపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బృంద సభ్యులు తనిఖీ చేశారు. బృంద సభ్యులు వెంట ప్రోగ్రాం అధికారులు డా.తులసి, మురళి, ప్రశాంతి, డీపీవో జగదీష్, స్టాటస్టికల్ అధికారి రామచంద్రరావు పాల్గొన్నారు.

22న ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

కంచరపాలెం: విశాఖ జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 22న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) ఓ ప్రకటనలో తెలిపారు. వాల్‌మార్ట్, బిగ్ సీ మొబైల్స్, మెడ్ ప్లస్, బిగ్ బాస్కెట్, టీం లీజ్, యూనియన్ బ్యాంక్, మహాదేవ్ షిప్పింగ్, శ్రీరామ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీల్లో 685 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. ఫ్లోర్ అసోసియేట్, వ్యాన్ డెలివరీ బాయ్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఫార్మాసిస్ట్, అసెంబ్లీ ఆపరేటింగ్ కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, కస్టమర్ ఎగ్జిక్యూటివ్, కెమిస్ట్, క్యాషియర్, పిక్కర్స్, డెలివరీ ఎగ్జిక్యూటివ్ అసోసియేట్, డ్యూటీ మెడికల్ ఆఫీసర్, వేర్‌హౌస్ అసోసియేట్స్, టీం లీడర్స్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు భర్తీ చేస్తారు. ఆయా ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ, ఐటీఐ, బీటెక్, ఎంబీఏలో ఉత్తీర్ణత సాధించిన 18-35 ఏళ్ల వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు. అభ్యర్థులు https://www.ncs.gov.in/ లో పేర్లు నమోదు చేసుకుని శుక్రవారం జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

23న ఏయూలో..

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో ఈ నెల 23న ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కేంద్రం డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు ఓ ప్రకటనలో తెలిపారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్‌లో ట్రైనీ కెమిస్ట్, జూనియర్ కెమిస్ట్ ఉద్యోగాల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ చదివిన వారు ఈ ఉద్యోగాలకు అర్హులు. ట్రైనీ కెమిస్ట్‌కు నెలకు రూ.19 వేలు, జూనియర్ కెమిస్ట్‌కు సీటీసీగా రూ.3.5 లక్షల వేతనం అందిస్తారు. మెడ్‌ప్లస్ ఇండియా లిమిటెడ్‌లో ఫార్మాసిస్ట్, ఫార్మసీ ఎయిడ్, ఫార్మసీ అసిస్ట్, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్, డెలివరీ బాయ్ తదితర ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారు. 10వ తరగతి నుంచి డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ చదివిన వారు ఈ ఉద్యోగాలకు అర్హులు. 20 నుంచి 35 ఏళ్ల లోపు వయసు కలిగిన వారు హాజరుకావచ్చు. వీరికి వేతనంగా నెలకు రూ.11 వేల నుంచి రూ.15 వేల వరకు చెల్లిస్తారు.

కొయ్యూరు జెడ్పీటీసీ నూకరాజుపై దాడి

- రోలుగుంట మండలంలో భూవివాదం
- జెడ్పీటీసీపై కర్రలతో దాడి చేసిన స్థానికులు
- తీవ్ర గాయాలతో నర్సీపట్నం ఆస్పత్రిలో చికిత్స


భూవివాదంలో గాయపడి అస్పత్రిలో చికిత్స పొందుతున్న కొయ్యూరు జెడ్పీటీసీ నూకరాజు

రోలుగుంట: ఎం.కె.పట్నం శివారు చటర్జీపురంలో అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, ఆయన కుమారుడు కన్నబాబు, మనుమడు చిన నూకరాజుపై స్థానికులు దాడి చేశారు. బుధవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనలో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. వీరిని నర్సీపట్నం ఆస్పత్రిలో చేర్చి, చికిత్స అందిస్తున్నారు. రోలుగుంట ఎస్ఐ తెలిపిన వివరాలు.. జిల్లా సరిహద్దులోని కొయ్యూరు మండలం జెడ్పీటీసీ వారా నూకరాజు.. చటర్జీపురంలో ఉన్న భూములు తమవని పేర్కొంటూ వాటిని స్వాధీనం చేసుకునేందుకు అనుచర వర్గంతో వచ్చారు. పదిహేనేళ్లుగా అక్కడ నివసిస్తూ పంటలు పండించుకుంటున్నామని స్థానిక గిరిజనులు అభ్యంతరం చెప్పారు. ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగి, ఘర్షణ ముదిరింది. స్థానికులు ఒక్కసారిగా జెడ్పీటీసీ వర్గంపై కర్రలతో దాడికి దిగారు. ఈ దాడిలో జెడ్పీటీసీ తలకు తీవ్ర గాయమైంది. ఆయనతోపాటు కుమారుడు, మనుమడు కూడా గాయపడ్డారు. ప్రస్తుతం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కొత్తకోట సీఐ ఇలియాస్ మహమ్మద్, రోలుగుంట ఎస్ఐ బి.నాగకార్తీక్ సంఘటనా స్థలానికి వెళ్లి విషయం తెలుసుకున్నారు. అక్కడ ఘర్షణ వాతావరణాన్ని సద్దుమణిగించారు. ఆస్పత్రికి వెళ్లిన ఎస్ఐ బాధితుల స్టేట్‌మెంట్ తీసుకుని కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆస్పత్రికి వెళ్లి, వారిని పరామర్శించారు. చటర్జీపురానికి చెందిన రెండవ వర్గం వారు కూడా స్వల్పంగా గాయపడ్డారు. భూ వివాదంపై వారు రోలుగుంట తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసేందుకు బుధవారం సాయంత్రం వెళ్లారు. ఆ సమయానికి అక్కడే ఉన్న నర్సీపట్నం ఆర్డీవో జయరాంని కలిసి, కొయ్యూరు జెడ్పీటీసీ నూకరాజు తమపై దాడి చేసి, గాయపరచాడని, తమ పండ్ల తోటలను ధ్వంసం చేయించాడని కేదారి రాజబాబు, నీలాపు ఎరకన్న, ఈదెల రాజేశ్వరి, నీలాపు అప్పలనాయుడు ఫిర్యాదు చేశారు.

ఎస్ఐ మీడియాతో మాట్లాడుతూ జెడ్పీటీసీ నూకరాజు ఈ ప్రాంతంలో భూమి కొనుగోలు చేసిన వివరాలు తమకు చెప్పారని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపడతామన్నారు. స్థానిక గిరిజనుల ఫిర్యాదుపై ఆర్డీవో మాట్లాడుతూ దీనిపై పూర్తి స్థాయి నివేదికను అందించాల్సిందిగా తహసీల్దార్ వరహాలను ఆదేశించినట్లు తెలిపారు. వాస్తవాలు పరిశీలించాక నివేదికను, ఉన్నతాధికారులకు అందించి, తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

రైవాడ కెనాల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

కె.కోటపాడు : దేవరాపల్లి నుంచి నరవ వరకూ గల 60 కిలోమీటర్ల కెనాల్ మార్గంలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జీవీఎంసీ మేయర్ జి.హరికుమారిని అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ కోరారు. విశాఖపట్నంలో గల మేయర్ హరికుమారి క్యాంప్ కార్యాలయం వద్ద బుధవారం కెనాల్ కార్మికులతో కలిసి వెళ్ళి వారి సమస్యలను అనురాధ వివరించారు. కెనాల్ మార్గంలో పని చేస్తున్న 136 మందికి రూ.15వేల వేతనాన్ని రూ.18,500లకు పెంచాలని కోరారు. రోజుకు 6 గంటల పాటు కెనాల్ నీటిలో నాచు తీసే పనిలో వీరు ఉండడం వల్ల చర్మ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారని, ఈ కారణంగా వీరికి హెల్త్ అలవెన్స్‌ను మంజూరు చేయాలని కోరారు. మేయర్ హరికుమారి స్పందిస్తూ కెనాల్ కార్మికుల వేతనాలకు సంబంధించిన ఫైల్‌ను అధికారుల నుంచి రప్పించుకొని కౌన్సిల్‌లో చర్చించనున్నట్టు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకున్న అనురాధకు కెనాల్ కార్మికులు కృతజ్ఞతలను తెలిపారు. కార్యక్రమంలో లంకవానిపాలెం సర్పంచ్ వేచలపు దొరబాబు, కొరువాడ ఎంపీటీసీ చీపురపల్లి అచ్చిబాబు, కెనాల్‌లో పని చేసే కార్మికులు వేచలపు శ్రీరామ్మూర్తి, గండి కోటి తదితరులు పాల్గొన్నారు.

కామకూటం నుంచి గర్భిణి డోలిమోత

- కింతలి పీహెచ్‌సీలో సుఖ ప్రసవం
- తల్లీ బిడ్డా క్షేమం


కామకూటం నుంచి డోలికట్టి గర్భిణి పాతీమాను తీసుకొస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : నెలలు నిండిన గర్భిణిని డోలికట్టి రెండు కిలోమీటర్లు తీసుకొచ్చిన తర్వాత కింతలి పీహెచ్‌సీకి ఆటో మీద తరలించారు. అక్కడ అమెకు సాధారణ ప్రసవం అయింది. మండలంలో జాలంపల్లి గ్రామ పంచాయితీ శివారు కామకూటం గ్రామానికి చెందిన వంతాల పాతీమా(30) నిండు గర్భిణి. అమెకు తొలికాన్పుగా అమ్మాయి జన్మించింది. రెండవ కాన్పు కాగా, నిండు చూలాలు కావడంతో మంగళవారం రాత్రి నుంచి పురిటి నొప్పులు ప్రారంభం అయ్యాయి. వెంటనే స్థానికులు కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.ఎం. నాయుడుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. జాలంపల్లి ఆరోగ్య సహాయకులు ఉగ్గిన సీతారామరాజుకు కూడా సమాచారం అందించారు. ఆయన బుధవారం ఉదయం గ్రామానికి చేరుకున్నారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల సహకారంతో డోలి కట్టి కామకూటం నుంచి కొండవీధి వరకు సుమారు రెండు కిలోమీటర్లు బురద రోడ్డులో డోలీ మీద తీసుకొచ్చి, అక్కడ ఆటో ఎక్కించి కింతలి పీహెచ్‌సీకి తరలించారు. మధ్యాహ్నం 11 గంటలకు పాతీమాకు సాధారణ ప్రసవం అయి పాపకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లీ బిడ్డ కింతలి పీహెచ్‌సీలో క్షేమంగా ఉన్నారని వైద్యుడు కె.ఎం.నాయుడు, ఆరోగ్య సహాయకుడు సీతారామరాజు తెలిపారు. సకాలంలో గ్రామానికి వచ్చి వైద్య సేవలు అందించిన వైద్య సిబ్బంది సీతారామరాజును గ్రామస్తులు అభినందించారు. ఇలా ఉండగా కామకూటం గ్రామానికి పోవు రహదారి నిర్మాణానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నిధులు మంజూరు చేశారని, అయితే అకాల వర్షాల వల్ల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని గ్రామస్తులు తెలిపారు.

బైక్‌ల చోరీ ముఠా అరెస్టు


అరేస్టు చేసిన నిందుతులతో అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్

20 బైక్‌లు స్వాధీనం

చింతపల్లి: ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న ముఠాను అరెస్టు చేసి, 20 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు... కొయ్యూరు మండలం రాజేంద్రపాలెంకు చెందిన మొల్లేటి రామాంజనేయులు బైక్ గత నెల 25న చోరీకి గురైంది. ఈ నెల 14న అందిన ఫిర్యాదు మేరకు కొయ్యూరు సీఐ స్వామినాయుడు, ఎస్ఐ రాజారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు బుధవారం ఉదయం దొడ్డవరం వద్ద వాహనాలు తనిఖీ చేశారు.

ఆ సమయంలో చింతపల్లి మండలం వంట్లమామిడి గ్రామానికి చెందిన వంతల సోమరాజు, మాకవరపాలెం తామరం గ్రామానికి చెందిన ఆకేటి దుర్గా ప్రసాద్ నంబర్ ప్లేట్ లేని బైక్ మీద వస్తూ పోలీసులను చూసి పరారవుతుండగా వారిని వెంబడించి పట్టుకున్నారు. వారి వద్దనుంచి పూర్తి సమాచారం రాబట్టారు. గతంలో విశాఖపట్నం, మాకవరపాలెం,రాజమహేంద్రవరం పాంతాల్లో వీరి బైక్‌లు దొంగిలించారు. వీరి వద్ద నుంచి పోలీసులు 20 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. సోమరాజు, దుర్గా ప్రసాద్‌లు చోరీ చేసిన ద్విచక్రవాహనాలను చింతపల్లి మండలం నిమ్మపాడుకు చెందిన గెమ్మిల సన్యాసిరావు(సంతోష్)కు విక్రయిస్తున్నారు. ఈ బైకులను సంతోష్ గంజాయి రవాణాకు వినియోగించడంతో పాటు, కొన్ని బైకులను ఒడిశా రాష్ట్రానికి తరలించి విక్రయిస్తున్నట్టు అదనపు ఎస్పీ తెలిపారు. వీరితో సంబంధం ఉన్న చింతపల్లి మండలం అన్నవరానికి చెందిన పాంగి ప్రకాష్, పోతురాజు గుమ్మలకు చెందిన వంతల నాగేంద్రలను కూడా అరెస్టు చేసి రిమాండ్ తరలించామన్నారు. గెమ్మిల సన్యాసిరావు(సంతోష్) గతంలో వేరే కేసులో అరెస్టు చేసినట్టు ఏఎస్పీ తెలిపారు.ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు.ఈ కార్యక్రమంలో చింతపల్లి సీఐ రమేష్, ఎస్ఐ అరుణ్ కిరణ్,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బెంగళూరు-హౌరా రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: ఎస్ఎంవీ బెంగళూరులో బుధవారం ఉదయం 10.35 గంటలకు బయల్దేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు-హౌరా(12864) ఎక్స్‌ప్రెస్ సుమారు 2 గంటలు ఆలస్యంగా 12.30 గంటలకు బయల్దేరింది. ఈ రైలుకు సంబంధించిన ఒక కోచ్‌లో మెకానికల్ సమస్య తలెత్తడంతో ఆలస్యంగా బయల్దేరినట్లు, అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్లకు చేరుకోనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

9 మందికి కారుణ్య నియామకాలు

సాక్షి,పాడేరు: ప్రభుత్వ సర్వీసులో ఉండగా, మృతిచెందిన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామక ఉత్తర్వులను అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం అందజేశారు. ఎస్.దిలీప్‌కుమార్, డి.వెంకటసాయి కార్తీక్, జి.మనోజ్‌కుమార్, ఎల్.చక్రధర్‌లను జూనియర్ అసిస్టెంట్లు, వెంకట కృష్ణప్రసాద్, అర్చన ప్రియ, ఎస్.కృపావతి, బి.రవికుమార్‌లను టైపిస్టుగా, డి.మహేశ్వరిని ఆఫీస్ సబార్డినేట్‌గా నియమించారు.

క్లుప్తంగా

23 వరకు సచివాలయాల్లో ఆధార్ సేవలు

అనకాపల్లిటౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయాల్లోనే ఆధార్ మార్పులు చేర్పులు, కొత్త అధార్ నమోదు వంటి కార్యక్రమాలు చేసుకునేందుకు ఈ నెల 23 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జెడ్పీ వెంకటరమణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయాల పరిధిలో ఆధార్ అప్‌డేట్ చేసుకోని వ్యక్తులు తక్షణమే చేసుకోవాలని కోరారు. సచివాలయాల్లో అందుబాటులోకి వచ్చిన ఈ ప్రత్యేక సేవల్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు.

మోదీ పాలనతో దేశంలో గణనీయ మార్పులు

అనకాపల్లిటౌన్: ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీవీవీ సత్యనారాయణ తెలిపారు. స్థానిక మెయిన్ రోడ్డు పోలింగ్ బూత్ నెం.201 పరిధిలో బుధవారం మోదీ జీవిత విశేషాల ఫొటో ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మోదీ తొమ్మిదేళ్ల పాలన గురించి వివరించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో బీజేపీ పాలనలో మాత్రమే గణనీయ మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. దేశంలో అన్ని జాతీయ రహదారుల అభివృద్ధి, కొత్త పార్లమెంట్ నిర్మాణం, కరోనా విపత్తులో దేశప్రజలకు ఉచిత వ్యాక్సిన్, గరీబ్ కల్యాణ్ అన్నయోజనతో పేదలకు ఉచిత బియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలను చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చదరం నాగేశ్వరరావు, నేతలు కర్రి రామకృష్ణ, ఓరుగంటి నాగమణి, కొండబాబు, నర్సింగ్ యాదవ్ పాల్గొన్నారు.

ఇంటింటా ఆరోగ్య సర్వే



లక్ష్మీదేవిపేటలో మహిళకు బీపీ చూస్తున్న ఏఎన్ఎం కర్రి మంగమ్మ

అనకాపల్లిటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే నెల 4వ తేదీ వరకు ఇంటింటా ఆరోగ్య సర్వే నిర్వహిస్తున్నట్లు జీవీఎంసీ పట్టణ 5వ సచివాలయం ఏఎన్ఎం కర్రి మంగమ్మ తెలిపారు. స్థానిక లక్ష్మీదేవిపేటలో బుధవారం సర్వేలో భాగంగా రక్తపరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 145 మందికి బీపీ, హెచ్‌బీ, సుగర్, మలేరియా, డెంగ్యూ పరీక్షలు చేశామన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు వచ్చే నెల 5న విజయరామరాజుపేట సీఎం ఆరోగ్య కేంద్రంలో స్పెషలిస్టు వైద్యులచే చికిత్స అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు వరలక్ష్మి, భారతి పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

ధాంగురే బంగారురాజా	రాజా
మార్క్ ఆంటోని	సత్యనారాయణస్క్రీన్-1
ది నన్	సత్యనారాయణస్క్రీన్-2
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి	షిర్డిసాయి
జవాన్	షిర్డిసాయి
జవాన్	వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	శ్రీసత్య
ఖుషి	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 284 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	--	--
రెండో రకం	4,040	4,100
మూడోరకం	3,730	4,030

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 62 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-35 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 326 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 228 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

గురుకులం.. చదువుల నిలయం

మారుమూల గ్రామీణ ప్రాంతాల పిల్లలకు ఉత్తమ విద్య అందించాలి. తల్లిదండ్రుల్లేని, లేదా ఇద్దరిలో ఒకరిని కోల్పోయిన గిరిజన, దళిత, బీసీ, అగ్రవర్ణ పేదల పిల్లలు విద్యకు దూరం కారాదు. ఇదే లక్ష్యంతో వసతితో కూడిన గురుకుల పాఠశాలల్ని ప్రభుత్వం స్థాపించింది. ఇలాంటి వాటిలో పట్టణంలో ఉన్న మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల ఒకటి. విద్యార్థులకు చదువుతోపాటు, క్రీడల్లో కూడా తర్ఫీదునిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తోంది.

- పదో తరగతి ఫలితాల్లో ముందంజ
- ట్రిపుల్ ఐటీ సీట్ల సాధనలో జిల్లాలో టాప్
- క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణింపు



పట్టణంలో గురుకుల పాఠశాల భవనం

తుమ్మపాల: రాష్ట్రంలో 100 వరకు గురుకుల విద్యాసంస్థలు ఉన్నాయి. అనకాపల్లి పట్టణంలో కూడా మహాత్మా జ్యోతిరావుపూలే పేరిట ఏర్పాటైన గురుకుల పాఠశాల పదో తరగతి ఫలితాల్లో దూసుకెళ్తోంది. గత విద్యా సంవత్సరం ఫలితాల్లో ముగ్గురు విద్యార్థులు ప్రతిభ పురస్కారాలు పొందడంతోపాటు, 10 మంది విద్యార్థులు రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్‌జీయూకేటీ)లో ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించి జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఈ స్కూల్‌ను నిలిపారు.

సీట్లకు భారీ డిమాండ్

పట్టణంలోని గురుకుల పాఠశాలలో సీట్లు పొందేందుకు ఏటా భారీ డిమాండ్ ఉంటుంది. ఈ ఏడాది కూడా కేవలం 60 సీట్ల కోసం దాదాపు 1,500 దరఖాస్తులు వచ్చాయి. ఇక్కడ చదువుతోపాటు క్రీడల్లో శిక్షణ, విద్యార్థుల్లో క్రమ శిక్షణకు పెద్ద పీట వేస్తారు. దీంతో ఏటా క్రీడలు, చదువుల్లో ఇక్కడి విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరుస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో ఈ గురుకుల పాఠశాల రాష్ట్రంలోనే 9వ స్థానంలో నిలిచిందంటే ఇక్కడ బోధన ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. క్రీడల్లో కూడా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబరిచి, పతకాలు సాధిస్తున్నారు.

ట్రిపుల్ ఐటీ సీట్లలో టాప్

జిల్లాలో అనేక ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, ఐదు గురుకుల పాఠశాలల విద్యార్థుల కన్నా టెన్త్ ఫలితాల్లో ఈ గురుకుల పాఠశాల మంచి ఫలితాలు సాధించింది. గత విద్యా సంవత్సరంలో ఈ స్కూల్‌కు చెందిన 10 మంది నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించారు. జిల్లాలో మరే స్కూల్ నుంచి ఇంత స్థాయిలో ట్రిపుల్ ఐటీ సీట్లు పొందిన విద్యార్థుల్లేరు. గత విద్యాసంవత్సరంలో జరిగిన టెన్త్ పరీక్షల్లో 550కి పైగా మార్కులు సాధించిన బి.జయదేవ్, కె.జయవర్ధన్,(నూజువీడు ఐఐఐటీ), వంశీ అజయ్, ఎ.గోపి, సీహెచ్ రామకృష్ణ, బి.శివచరణ్, కె.రాజేంద్రనాథ్, ఎస్.వాణి(ఒంగోలు ఐఐఐటీ), కె.దేవకుమార్, కిరణ్ గణేష్(శ్రీకాకుళం ఐఐఐటీ) ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించి, ఆయా కళాశాలల్లో ప్రస్తుతం ఉన్నత చదువులు చదువుతున్నారు.

క్రీడల్లోనూ ముందంజ

పట్టణంలో గురుకులం ప్రైవేట్ భవనంలో కొనసాగుతూ సరైన ఆటస్థలం లేకున్నా.. విద్యార్థులు ప్రత్యేక కృషితో క్రీడల్లో రాణిస్తున్నారు. పాఠశాల సిబ్బంది సహకారంతో క్రీడల్లో శిక్షణ పొంది, జాతీయ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలుస్తున్నారు. జంప్‌త్రో పోటీల్లో స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు జాతీయ స్థాయిలో గెలుపొందారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బ్యాడ్మింటన్ క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో 20 మంది, జిల్లా స్థాయిలో 40 మంది విద్యార్థులు ప్రతిభ కనబరచి పలు పతకాలు సాధించారు.



క్రీడల్లో గురుకుల పాఠశాల విద్యార్థులు

వారి ప్రోత్సాహంతోనే..



నాకు టెన్త్‌లో 577 మార్కులు వచ్చాయి. మా స్కూల్ టీచర్లు, హాస్టల్ సిబ్బంది ప్రోత్సాహం వల్లే ఇంత మంచి మార్కులు సాధించగలిగా. పదో తరగతి ప్రారంభం నుంచే ప్రతి పాఠ్యాంశాన్ని అర్థమయ్యేలా బోధించారు. ప్రభుత్వం నుంచి ఆణిముత్యం పురస్కారాన్ని కూడా పొందా. వారిచ్చిన ప్రోత్సాహంతోనే ట్రిపుల్ ఐటీ నూజివీడులో సీటు దక్కింది. గత నెల్లోనే కాలేజీలో చేరాను.

– బి.జయదేవ్, ఐఐఐటీ, నూజివీడు

ఇప్పటి నుంచే ప్రత్యేక తరగతులు



నేను టెన్త్ పరీక్షల్లో 580కి పైగా మార్కులు సాధించాలన్న లక్ష్యంతో చదువుతున్నా. ప్రతి సబ్జెక్టులో పాఠ్యాంశాలపై సందేహాలు తీర్చేందుకు ఇప్పటి నుంచే స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నారు. మా సీనియర్స్‌లా నేను కూడా ట్రిపుల్ ఐటీలో సీటు సాధిస్తాను. ఇటీవల గురుకుల పాఠశాలల ఆధ్వర్యంలో జీకేపై నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో రెండో ర్యాంకు సాధించాను.

– మౌళి, 10వ తరగతి

ట్రిపుల్ ఐటీ లక్ష్యంగా బోధన



పదిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు ప్రతిభ పురస్కారాలు పొందారు. పది మంది ట్రిపుల్ ఐటీలకు ఎంపికయ్యారు. ఈసారి పది కన్నా ఎక్కువ మంది ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించేలా బోధన జరుగుతోంది. రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. రోజూ పరీక్షల ద్వారా, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిపై మరింత ఫోకస్ పెంచుతున్నాం.

– టి.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్

వచ్చే నెల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష'



తాళ్లపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వాల్ పోస్టర్ ఆవిష్కరణ

కశింకోట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వచ్చే నెల 19 నుంచి జరగనుందని, దీన్ని పకడ్బందీగా నిర్వహించి, విజయవంతం చేయాలని ఎంఎల్‌వో ప్రేమ్ కోరారు. మండలంలోని తాళ్లపాలెంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణపై గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై సర్వే నిర్వహించాలన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి అవసరాన్ని అనుసరించి టెస్టులు చేయించాలన్నారు. అనంతరం ఆరోగ్య సురక్షపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, ప్రతినిధి ఇందల ముసిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

'చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ రాములమ్మ



హాజరైన విద్యార్థులు

అనకాపల్లిటౌన్: విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అనకాపల్లి దిశ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ పి.రాములమ్మ అన్నారు. స్థానిక గవరపాలెం హిమశేఖర్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు కళాశాల ఆవరణలో బుధవారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఉన్నత విలువలు, క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. యువత చెడు మార్గంలోకి వెళ్లకుండా మంచి మార్గంలో నడుచుకోవాలని హితవుపలికారు. బాల్య వివాహాల అనర్థాలు, ఈవ్ టీజింగ్, పోక్సో, దిశ చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. కొంత మంది విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటుపడి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ప్రిన్సిపాల్ సురేష్ మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు సమాజానికి, కుటుంబానికి మంచి పేరు తీసుకువస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో దిశ స్టేషన్ హెచ్‌సీ వేదవతి, అధ్యాపకులు పూర్ణ, సురేష్, రమేష్, గోపీకృష్ణ, నాగలక్ష్మి, జగన్, శేషు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉన్నత భవిష్యత్తు



మండల స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

అనకాపల్లిటౌన్: విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుని, జాతీయ స్థాయిలో రాణిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడవచ్చని మహాత్మా జ్యోతీరావుపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో పాఠశాలకు చెందిన 46 మంది విజేతలుగా నిలిచారు. వీరిని పాఠశాల ఆవరణలో బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరంతా త్వరలో జరిగే నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఖోఖో, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, వాలీబాల్, టెన్నీకాయిట్, అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ 14 విభాగంలో 27 మంది, అండర్ 17 విభాగంలో 19 మంది విద్యార్థులు నియోజకవర్గ స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో కూడా గెలుపొంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావాలని అభిలషించారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై హర్షం



నారీ శక్తి వందన్ చట్టం ఆమోదంతో మహిళల ఆనందోత్సాహం

కశింకోట: నారీ శక్తి వందన్ చట్టం బిల్లుకు లోక్‌సభలో ఆమోదం లభించడం పట్ల స్థానిక కస్పావీధి రామాలయంలో బుధవారం రాత్రి మహిళలు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు ఆమోదించడం చారిత్రాత్మకమైనదిగా అభివర్ణించారు. మహిళలకు జీరో బ్యాలెన్స్ బ్యాంకు ఖాతాలు, ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్లు, గరీబ్ కల్యాణ్ అన్న యోజనలో ఉచిత బియ్యం పంపిణీ తదితర సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు నడిపల్లి గంగాభవాని, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చదరం నాగేశ్వరరావు, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు కొండబాబు, కోశాధికారి ఎం.ఎం.నాయుడు, మాజీ ఉప సర్పంచ్ నడిపల్లి సన్యాసిరావు, కోదండ సీతారామాలయ బోర్డు మాజీ చైర్మన్ శిష్టి అప్పారావు, పార్టీ నాయకుడు హరనాథ్ పాల్గొన్నారు.

నేడు కశింకోట పీఏసీఎస్ సమావేశం

కశింకోట: కశింకోట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వ సభ్య సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు సంఘ ఆవరణలో జరపనున్నట్లు చైర్‌పర్సన్ గొంతిన అప్పారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 2022-23 ఆడిట్ నివేదిక ఆమోదం, 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు, అప్పటి నుంచి ఇప్పటి వరకు జమా ఖర్చుల ఆమోదం, 2022-23 ఆదాయ, వ్యయాల సవరణ బడ్జెట్, 2023-24 అంచనా ఆదాయ, వ్యయాల బడ్జెట్ ఆమోదం తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సంఘ సభ్యులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఘనంగా అక్కినేని శత జయంతి ఉత్సవాలు



అక్కినేని జయంతి సందర్భంగా పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న బల్లా నాగభూషణం

అనకాపల్లిటౌన్: స్థానిక చిన్నరాజుపేట సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. అక్కినేని చిత్రపటానికి అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, నటసామ్రాట్ అక్కినేని శతజయంతి వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. నాటకాల నుంచి సినీరంగంలోకి ప్రవేశించి వందలాది చిత్రాల్లో నటించి, తెలుగు సినిమా ఖ్యాతిని పెంచారని కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఉజ్జి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు వినకోట నీలేష్‌గుప్తా, కార్యవర్గ సభ్యులు రొబ్బి మల్లేశ్వరరావు, పట్నాల కృష్ణమోహన్‌రావు, పొట్టి శ్రీరాములు పాల్గొన్నారు.

'ప్రకృతి' ఉత్పత్తులకు మార్కెటింగ్ వసతి



తాళ్లపాలెంలో జీవామృతం తయారీని పరిశీలిస్తున్న మార్కెటింగ్ ట్రైనీ అప్పలరాజు



ప్రకృతి సాగు చెరకు పంటను పరిశీలిస్తున్న అప్పలరాజు

కశింకోట: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించనున్నట్లు ప్రకృతి వ్యవసాయ శాఖ మార్కెటింగ్ ట్రైనర్ ఎం.టి.అప్పలరాజు తెలిపారు. మండలంలోని తాళ్లపాలెంలో ప్రకృతి వ్యవసాయం సాగు చేసే రైతులు, సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రకృతి సాగు రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి వాటి ద్వారా వారు పండించిన ఉత్పత్తులను కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ప్రకృతి వ్యవసాయ సాగు రైతు తమ పొలాల్లో శాశ్వతంగా ఉండేలా సిమెంట్ కుండీలను ఏర్పాటు చేసుకుని, వాటిలో పంట దిగుబడికి దోహదపడే జీవామృతం తయారు చేసుకోవాలని సూచించారు. పంటకు ప్రతి 15 రోజులకు ఒక సారి జీవామృతాన్ని సాగు నీటి ద్వారా అందించాలన్నారు. పంటపై పిచికారీ చేసినా సరిపోతుందన్నారు. జీవామృత వినియోగంతో భూమి సారవంతమై, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి వస్తుందన్నారు. ఈ సందర్భంగా జీవామృత తయారీ విధానాన్ని పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న చెరకు పంటను పరిశీలించారు. ఆయన వెంట ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి డి.రమణ, రైతులు కర్రి సత్యనారాయణ, చిన్ని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో విద్యార్థుల ప్రతిభ



బాలికల విభాగం మండల స్థాయి ఓవరాల్ చాంప్ కశింకోట బాలికల హైస్కూల్ విద్యార్థులు



బాలుర విభాగం మండల స్థాయి ఓవరాల్ చాంప్ కన్నూరుపాలెం హైస్కూల్ విద్యార్థులు

కశింకోట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా బాలిక విభాగంలో కశింకోట బాలికల హైస్కూల్ విద్యార్థులు, బాలుర విభాగంలో కన్నూరుపాలెం హైస్కూల్ విద్యార్థులు నిలిచారని ఆయా స్కూళ్ల పీడీలు పెంటకోట కమల, పీలా వీరునాయుడు బుధవారం తెలిపారు. మూడు రోజుల పాటు బాల, బాలికలకు వేర్వేరుగా నిర్వహించిన పోటీల్లో కశింకోట బాలికల హైస్కూల్ విద్యార్థులు వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్, లాంగ్ జంప్, హై జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, యోగా పోటీల్లో విజేతలుగా నిలిచి, ఓవరాల్ చాంపియన్ షిప్ పొందారు. కన్నూరుపాలెం విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగాలో విజేతలుగా నిలిచారు. వీరిని సర్పంచ్ మంత్రి జయరజని, విద్యా కమిటీ చైర్మన్ యల్లపు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు. జోన్‌స్థాయి పోటీల్లో కూడా గెలుపొందాలని ఆకాంక్షించారు. తాళ్లపాలెం గాయత్రీ స్కూల్ విద్యార్థులు కూడా మండల స్థాయి క్రీడా పోటీల్లో వివిధ ఆటల్లో ప్రతిభ చూపి, బహుమతులు గెలుచుకున్నారు. వీరిని ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

నిమజ్జనోత్సవాలకు పటిష్ట బందోబస్తు

కశింకోట: వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని నిర్వాహకులను ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి కోరారు. కశింకోటలోని గవరపేటలో వినాయక నిమజ్జనాలు చేయనున్న శారదానది రేవును బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా పూర్తి కావడానికి పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఉన్నారు.

ఏఐసీసీ డెంటల్ ఉద్యోగ మేళాకు స్పందన



సమావేశంలో పాల్గొన్న శాంసన్‌రాజు

తుమ్మపాల: ఇటీవల కాలంలో దంత సమస్యలు ఎక్కువ మందిని వేధిస్తున్నాయని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేట్ క్రిస్టియన్ కౌన్సిల్(ఏఐసీసీ) జిల్లా అధ్యక్షుడు శాంసన్‌రాజు అన్నారు. స్థానిక సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో బుధవారం ఏఐసీసీ ఆధ్వర్యంలో డెంటల్‌కేర్ గ్లోబల్ ఆర్గనైజేషన్ ఉద్యోగ మేళా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటి సమస్యను గుర్తించే ఆధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. డెంటల్ అభ్యర్థులకు ఉద్యోగావకాశాలూ పెరుగుతున్నాయన్నారు. అంతకు ముందు కేరళ డెంటల్ కేర్ సంస్థ ఎండీ జోహన్, కార్యదర్శి దానీలు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ మేళాకు 250 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు సతీష్ చిట్టారెడ్డి, కార్యదర్శి శామ్యూల్‌రెడ్డి, కమిటీ సభ్యులు పండ్రాణ తిమోతి, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఉద్యోగార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యం



అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దంతులూరి దిలీప్ కుమార్

అనకాపల్లి రూరల్: ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని తుమ్మపాల, తగరంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చెరో రూ.9.83 లక్షల నిధులతో ఆరు బెడ్ల అదనపు గదుల నిర్మాణానికి ఎంపీపీ గొర్లి సూరిబాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో గత నాలుగేళ్లలో వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటింటికీ వైద్యం చేరువైందన్నారు. త్వరలో అమలు చేయనున్న జగనన్న ఆరోగ్య సురక్షతో రాష్ట్ర ప్రజలందరికీ వైద్య సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, సర్పంచ్‌లు తట్టా పెంటయ్యనాయుడు, యాదగిరి అప్పారావు, రాపేటి నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు విల్లూరి సూర్యకుమారి, అయితా ఆనందరాము, పార్టీ నాయకులు విల్లూరి చంద్రశేఖర్, పన్నీరు చంటి, వెంకటలక్ష్మి, పంచదార్ల కన్నారావు, వద్దాది భారతి అశోక్, దంతులూరి కల్యాణ్ చక్రవర్తి, కనుబుద్ది శంకర్రావు, ఆర్టీసీ సత్యనారాయణ, పీలా బుజ్జి, శ్రీను, పడాల గణపతి, వార్డు సభ్యులు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.